## క్లుప్తంగా

### రోడ్డుపై గుంతలో చేపలు పడుతూ నిరసన



గుంతలో చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

**బెజ్జూర్:** మండలంలోని సలుగుపెల్లి నుంచి పెంచికల్‌పేట్ వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో మరమ్మతులు చేపట్టాలని శుక్రవారం ఆర్టీసీ బస్సు డ్రైవర్ తోపాటు ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నీరు నిల్వ ఉన్న గుంతల్లో చేపలు పడుతూ ప్రయాణికులు నిరసన తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

### 'అండర్‌బ్రిడ్జిలో నిలిచిన నీటిని తొలగించాలి'



రైల్వే అండర్‌బ్రిడ్జిని పరిశీలిస్తున్న శ్యాంరావు

**కాగజ్‌నగర్‌రూరల్:** మండలంలోని వంజీరి గ్రామానికి వెళ్లే దారిలో గల రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు అన్నారు. శుక్రవారం అండర్‌బ్రిడ్జిని పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయని, దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి నీటిని తొలగించాలని కోరుతూ రైల్వే జనరల్‌మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

### ఏబీవీపీ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

**ఆసిఫాబాద్‌రూరల్:** ఏబీవీపీ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ 76 వసంతాలు పూర్తి చేసుకున్న అతిపెద్ద విద్యార్థి సంఘం అన్నారు. కార్యవర్గంలో మండల కార్యదర్శిగా హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా సాయినాథ్, వైభవ్, సిద్ధార్థ, నవీన్, సంయుక్త కార్యదర్శులుగా రంజిత్, శశాంక్, హాస్టల్ ఇన్‌చార్జీలుగా జమిన్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సుధీర్, కార్యవర్గ సభ్యులుగా సచిన్, మల్లేష్, ఈశ్వర్ లక్ష్మి, ఆకాశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



వాహనదారులకు డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఎస్సై చంద్రశేఖర్

**రెబ్బెన:** మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై డి. చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలో గోలేటిలో డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. యువత మద్యం మత్తులో వాహనాలను నడిపి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కానిస్టేబుల్ అంజన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### 'కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోండి'

**కాగజ్‌నగర్‌రూరల్:** ఎస్పీఎం కార్మికులు నివాస ముండే క్వార్టర్ల పరిసరాలను, పారిశుద్ధ్య వ్యవస్థను సక్రమంగా చేపట్టి కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యక్రమ కోర్డినేటర్ గోలెం వెంకటేశం అన్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు క్వార్టర్లలోకి వస్తుందన్నారు. మురికి కాలువలు పూడికతీత తీయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. యాజమాన్య ప్రతినిధులు డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

# జోరువానతో జలమయం

జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చెరువులు, కుంటల్లో వరద నీరు చేరుతోంది. వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు ప్రమాదకరంగా వాగులు దాటి తమ గ్రామాలకు చేరుకున్నారు. వర్షానికి పలు మండలాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. బెజ్జూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు భారీగా చేరి చెరువును తలపిస్తోంది. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల మండలం గురుడుపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో వరద నీరు చేరి బురదమయంగా మారింది. దీంతో పలువురు విద్యార్థులు జారి పడి గాయాలపాలయ్యారు. - సాక్షి నెట్‌వర్క్



దహెగాం: చెరువును తలపిస్తున్న పంట పొలాలు



దహెగాం: రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



దహెగాం: ఐనంలో నీట మునిగిన పత్తి పంట



చింతలమానెపల్లి: ఉప్పొంగిన వాగు



సిర్పూర్ (టి): చీలపెల్లి వాగు దాటుతున్న ప్రజలు



బెజ్జూర్: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నీరు



రెబ్బెన: నంబాలలో నీట మునిగిన పొలాలు



కౌటాల: గురుడుపేట పాఠశాలలో..

### నాడు వెలవెల.. నేడు జలకళ





వేసవి కాలంలో ఎండ తీవ్రతతో చెరువులు, ప్రాజెక్టుల్లో చుక్క నీరు లేక వెలవెలబోయాయి. చెరువుల్లో నీరు లేక మూగజీవాలు సైతం అల్లాడిపోయాయి. గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురువడంతో దహెగాం మండలంలోని కల్వాడ సమీపంలో ఉన్న పీపీరావు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు నిండి మత్తడిపై నుంచి అలుగు పారుతోంది. వరద నీరు ఎర్రవాగులోకి చేరుతోంది. - దహెగాం

## ప్రజలు, పోలీసులకు మధ్య వారధి మీడియా

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

**ఆసిఫాబాద్‌అర్బన్:** అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా మీడియా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జర్నలిస్టులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమైందని, జర్నలిస్టులకు తమ శాఖ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు షీటీం, కళా బృందాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, వీటికి మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

**కానిస్టేబుల్ కుటుంబానికి చెక్ అందజేత**

ఈజ్‌గాం పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మరణించిన దయానంద్ కుటుంబానికి ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో రూ.8లక్షల విలువైన చెక్కు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ్‌శంకర్, సీనియర్ అసిస్టెంట్ అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కిరణ్

**కెరమెరి:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నీంగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో పాలిటెక్నిక్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వసాకే సాయికుమార్, సారికృష్ణ, సతీశ్, అయ్యూబ్, సాయి, రాజేందర్, నవీన్, కార్తిక్, భీంరావు, ఆకాశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఐకేపీ మండల సమాఖ్య కార్యాలయం ప్రారంభం

**చింతలమానెపల్లి:** పాత భవనం నుంచి కొత్త భవనంలోకి మారిన మండల ఐకేపీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ మహిళా సమాఖ్యలు తమ లక్ష్యాలను పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. బ్యాంకు తరపున మహిళా సమాఖ్యలకు పూర్తి సహకారాలు అందిస్తామని, బ్యాంకులు అందించే ఆర్థిక లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను సభ్యులకు, మహిళలకు అందేలా చూడాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ అధికారి సతీశ్, సీసీలు జాడి శ్యాంరావు, పరమేశ్,సంధ్యారాణి, కుసుమ, రాజేశ్వరి, మహిళా సమాఖ్య కార్యదర్శి కమల, సభ్యులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ పాలనలో గ్రామపంచాయతీలకు గ్రహణం'



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

**రెబ్బెన:** కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలకు నిధులు రాక గ్రహణం పట్టుకుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. శుక్రవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కుప్పకూలిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవటంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి 7నెలలు గడుస్తున్నా ఎన్నికలను నిర్వహించకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

# రోగులకు వైద్య పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**కౌటాల:** మండలంలోని గుండాయిపేట గ్రామంలో కౌటాల వైద్య సిబ్బంది శుక్రవారం రోగులకు వైద్య పరీక్షలు చేశారు. శుక్రవారం 'సాక్షి'లో 'మంచం పట్టిన గుండాయిపేట' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్య శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయాలని, మురికినీరు నిల్వ ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, తిరుపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**దోమలతోనే వ్యాధులు..**

దోమల కాటుతోనే ప్రజలకు వ్యాధులు సోకుతాయని, దోమల వ్యాప్తిని అరికట్టాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో ప్రజాలైఫ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, గ్రామాల్లో ఎక్కడ నీటి నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అధికారులు శానిటేషన్ చేయాలని, సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు సాయివివేక్, శ్రావణ్‌కుమార్‌లు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. పలువురికి రక్తపరీక్షలు చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు వానుపటేల్, నాయకులు ఎల్ములే మల్లయ్య, దుర్గం మోతీరాం, యశ్వంత్‌రావు, మిథున్, మధుకర్, శ్రీకాంత్, మోరేశ్వర్, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జియో ఫొటో అటెండెన్స్ రద్దు చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

**చింతలమానెపల్లి:** జిల్లాలో ఉపాధ్యాయులకు జియో ఫొటో అటెండెన్స్ రద్దు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని డబ్బా, గంగాపూర్, చింతలమానెపల్లి, బాబాసాగర్, కేజీబీవీ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నియమ నిబంధనల ప్రకారం రోజువారి పట్టికలో మాత్రమే సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విద్యాశాఖ అధికారి జియో ఫొటో పెట్టాలని మౌఖిక ఆదేశాలు చేయడం సరికాదన్నారు. సంఘం మండల అధ్యక్షుడు కుర్మదాస్, కార్యదర్శి రవీందర్, సభ్యులు జయరాజ్, మురళి, దేవ్‌రావ్ చౌహాన్, దొడ్డిపట్ల రవి కుమార్ పాల్గొన్నారు.

# శిథిలావస్థలో 'గురుకులం'

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు



శిథిలావస్థలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల డార్మెంటరీ భవనం

**సిర్పూర్(టి):** మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పాఠశాల, కళాశాల భవనంతో పాటు డార్మెంటరీ భవనం, వంటగదులు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. గురుకుల పాఠశాల, కళాశాలలో మొత్తం 580 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

**ఇబ్బందులు అనేకం..**

శిథిలావస్థలో ఉన్న భవనాలతో విద్యార్థులు వర్షాకాలంలో పడే ఇబ్బందులు అనేకంగా ఉన్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శిథిలావస్థలో ఉన్న గోడల పైకప్పు పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలలో విద్యుత్ వైర్లు సరిగా లేకపోవడంతో ఎర్తింగ్ వస్తోంది. వసతిగృహాల్లో ఫ్యాన్లు సరిగా పని చేయకపోవడంతో విద్యార్థులు దోమలతో తిప్పలు పడుతున్నారు. డార్మెంటరీ భవనానికి ఉన్న కిటికీలు కొన్ని విరిగిపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. పాఠశాల, కళాశాల మొత్తానికి ఒకే బోర్ ఉండటంతో పని చేయని సందర్భంలో విద్యార్థులు తాగునీటితో పాటు వ్యక్తిగత అవసరాలకు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. పాఠశాల మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి తలుపులు కూడా సరిగా లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. తాగునీటి నల్లాలు సైతం పరిశుభ్రంగా లేకపోవడం గమనార్హం.

**పట్టించుకోని అధికారులు..**

సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. భవనాలు, మరుగుదొడ్లు, వంట గది, డైనింగ్ రూంలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకర పరిస్థితుల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్, ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



నాటిన మొక్క వద్ద కలెక్టర్, అదనపు కలెక్టర్

**ఆసిఫాబాద్‌రూరల్:** మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన బాలురు పాఠశాలలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మొక్కలు నాటారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమానికి 53 లక్షల మొక్కల లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటివరకు 35శాతం మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలల్లో జామ, సీతాఫలాలు వంటి పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. నాటి మొక్కలు కాపాడుకున్నప్పుడే ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ప్రిన్సిపాల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**గిరిజన గురుకుల బాలికల పాఠశాల తనిఖీ**

జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేశారు. వంట, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. వర్షాకాలంలో విద్యార్థులకు తాజా కూరగాయలతో భోజనం అందించాలన్నారు. వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డీటీడీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

## శిశుమందిర్‌లో గోరింటాకు సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, విద్యార్థినులు గోరింటాకు పెట్టుకున్నారు. పాఠశాల ప్రతినిధి కల్లూరి వైష్ణవి గోరింటాకు విశిష్టతను వివరించారు. హెచ్‌ఎం కోటేశ్వర్ రావు, మాతృభారతి సభ్యురాలు రమాదేవి, దుర్గ, హరిత తదితరులు ఉన్నారు.